



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు

'కర్నూలు-విజయవాడ' ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలి

- సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్
- సిపిఎం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఎదుట రెండ్రోజుల నిరసన దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నుండి విజయవాడకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. కర్నూలు నుండి విజయవాడకు రైళ్లను నడపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట రెండ్రోజుల నిరసన దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంఏ గఫూర్ హాజరై దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కర్నూలు నుండి హైదరాబాదుకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కోసం సిపిఎంగా చేసిన పోరాటం ఫలితంగానే ప్రస్తుతం ఇంటర్‌సిటీ రైలు నడుస్తుందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కర్నూలు నుండి విజయవాడ వెళ్లడానికి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు లేకపోవడం అన్యాయమన్నారు. కర్నూలు నుండి మచిలీపట్నం వరకు నడిచే రైలును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పంచలింగాల రైల్వే వ్యాగన్ త్వరగా పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. కర్నూలు నుండి ఓర్వకల్లు మీదుగా నంద్యాలకు రైలు మార్గం వెయ్యాలని డిమాండ్ చేశారు. డబల్ ట్రాక్ మహబూబ్ నగర్ వరకు వచ్చి నిలబడిపోయిందని, ఈ డబల్ ట్రాక్‌ను కర్నూలు నుండి డోన్ వరకు పొడిగిస్తూ కొనసాగించాలని కోరారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎ.గఫూర్

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు నగరం నుండి విజయవాడకు అనేకమంది వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, ప్రభుత్వ అధికారులు పనుల నిమిత్తం వెళ్లాలంటే ఇక్కడి నుండి విజయవాడకు ఒక్క రైలు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. కర్నూలు నుండి విజయవాడకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్షణమే రైల్వే శాఖ స్పందించి కర్నూలు నుండి విజయవాడకు వెళ్లే రైళ్ల సంఖ్యను పెంచాలని, అలాగే జనరల్ బోగీల సంఖ్యను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. కాచిగూడ నుండి గుంటూరు వరకు నడుస్తున్న రైలును విజయవాడ వరకు పొడిగించాలని కోరారు. సిపిఎం చేపట్టిన ఉద్యమాన్ని నగర ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక సోదరులందరూ కూడా బలపరచాలని కోరారు. కర్నూలు నుండి విజయవాడకు వెళ్లే రైళ్ల సంఖ్యను పెంచాలని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని, కర్నూలు నగరం పాత రాజధాని అనే విషయాన్ని మర్చిపోకూడదని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే కర్నూలు అత్యంత వెనుకబడిన జిల్లా అన్నారు. వెనుకబడిన జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోడీ సామాన్య ప్రజల ఇబ్బందులను గుర్తించి శ్రీశైలానికి కూడా రైలు మార్గం వేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం కేంద్రంపైన ఒత్తిడి పెంచి రైలు మార్గాలు, రైళ్ల సంఖ్య పెరిగేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 3వ తేదీ జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు నగర కార్యదర్శి మారెళ్ళ విజయ రామాంజనేయులు, ఆవాజ్ నగర కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్యామల, ఉమాదేవి, నగర కార్యదర్శి బంగి పద్మ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌డి.ఖాజా పాషాలు తమ సంఘాల ద్వారా ఈ దీక్షలకు మద్దతుగా ప్రసంగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, ఉపాధ్యక్షులు దివాకర్, నగేష్, మహమ్మద్ రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, ప్రజా నాట్యమండలి కళాకారులు ఈ.నాగరాజు, బాలు, లోకేష్, రాంబాబు, నాగస్వాములు సరిత, లక్ష్మి తదితరులు పాల్గొని ఉద్యమ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, ఎం.రాజశేఖర్, కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ, కృష్ణ, డి.అబ్దుల్ దేశాయ్, నరసింహ, సాయిబాబా, సుధాకరప్పా, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి
- పంచలింగాలలో పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్, ఎంపీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్/కలెక్టరేట్

విద్యార్థులు బాగా చదువుకుని గొప్ప స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచించారు. శనివారం కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరితో కలిసి ఎంపీ బస్తిపాటి నాగరాజు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్వయంగా లబ్ధిదారుల ఇంటి వద్దకెళ్లి పింఛను డబ్బులు అందజేశారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. అనంతరం గ్రామంలోని ఉర్దూ హైస్కూల్‌ను వారు తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. పాఠశాలలోని సమస్యలు, కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సందీప్, తహశీల్దార్ రమేష్ బాబు, సర్పంచి మాధవి లత పాల్గొన్నారు.

2,37,904 మందికి రూ.103.82 కోట్ల అందజేత

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద నవంబర్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 37 వేల 904 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.103.82 కోట్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డా.ఎ.సిరి పేర్కొన్నారు. కర్నూల్ నగరంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ సందీప్ కుమార్, డిఆర్డిఎ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ అధికారులతో జిల్లా కలెక్టర్ భేటీ

కర్నూలు కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్రానికి చెందిన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అఖిల భారత సర్వీసుల అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి భేటీ అయ్యారు. కల్లూరు మండలం పెద్దటేకూరు, ఓర్వకల్లు మండలం హుసేనాపురం, కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం, కర్నూల్ మున్సిపాలిటీలో కార్యక్రమాలను పరిశీలించేందుకు జిల్లాకు వచ్చారు. ఈ నెల 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా ప్రాముఖ్యత, పర్యాటక ప్రాంతాలు, ఇతర వివరాలను అఖిల భారత సర్వీసుల అధికారులకు వివరించారు.. సమావేశంలో డిఆర్‌ఒ వెంకట నారాయణమ్మ, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, 15 మంది అఖిల భారత సర్వీసుల అధికారులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ హబ్‌ను పూర్తి చేయాలి

- స్థానిక యువతకు ఉపాధి చూపించాలి : డివైఎఫ్ఐ
- ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌ను వెంటనే పూర్తి చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ఆవిష్కరించారు. అనంతరం నగర కార్యదర్శి హుస్సేన్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఓర్వకల్ పారిశ్రామిక హబ్‌గా మార్చి లక్షలాదిమందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఇండస్ట్రియల్ హబ్ ఏమైందని ప్రశ్నించారు. మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని కోరారు. రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని ప్రచారం చేస్తుందన్నారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే కనీసం లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పెట్టుబడుల పేరుతో రైతుల నుండి భూములు లాక్కోవడం తప్ప ఏమీ చేయలేదన్నారు. అత్యంత వెనకబడిన కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు టెక్స్టైల్ పరిశ్రమ, ఆలూరులో జింకల పార్కు, ఆదోనిలో జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమ, పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ తదితర వాటిని ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని రూపుమాపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటి కోసం జిల్లాలో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాలని, లేకపోతే జిల్లాను మోసం చేసిన వారుగా చరిత్రలో మిగిలిపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు హుస్సేన్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, జిల్లా నాయకులు కిషన్, ఇమ్రాన్, ధను, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

విజృంభిస్తున్న విష జ్వరాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతు న్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60 శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరా లతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌లు, డోన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ప్రైవేటు ఆసుపత్రులు, రోగులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీకి 2700 మంది రోగులు వచ్చేవారు. పది రోజులుగా ఈ సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య 3వేలు దాటుతోంది. వీరిలో ప్రతి రోజూ 200 మంది దాకా అడ్మిషన్ పొందుతున్నారు. ఇందులో 70 శాతం వైరల్ ఫీవర్ కేసులు ఉండటం కలవరపెడుతోంది. నంద్యాల జీజీహెచ్‌లో కూడా ఓపీ రోగుల సంఖ్య 1300 నుంచి 1500 దాకా నమోదవుతున్నాయి. ఇక ఆదోని ఆసుపత్రిలో రోజు వారి ఓపీ 800 దాటుతోంది. విషజ్వరాలు పెరగడంతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షల కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో 2024లో 225 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 203 కేసులు నమోదయ్యాయి. సస్పెక్టెడ్ కేసులు 2024లో 1285 కేసులు రాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 2224 కేసులు వచ్చాయి. మలేరియా కేసులు 2024లో 17 రాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 9 కేసులు నమోదయ్యాయి. చికెన్ గున్యా కేసులు 2024లో 10 నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 11 కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. నంద్యాల జిల్లాలో 95 డెంగీ కేసులను గుర్తించారు. మలేరియా కేసులు 12గా గుర్తించారు. బేతంచెర్ల, నందికొట్కూరు, డోన్, నంద్యాల ప్రాంతాల్లో డెంగీ వ్యాధిగ్రస్థుల సంఖ్య అధికంగా ఉంది.

'టెట్'పై మండిపాటు : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు కూడా తప్పనిసరిగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అర్హత సాధించాలని సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తాజా తీర్పు ప్రకారం, రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం అమలు పరిచిన తేదీకి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు ఇంకా రిటైర్మెంట్‌కు ఐదు సంవత్సరాలకు మించి సేవా కాలం ఉన్నవారు, రెండు సంవత్సరాల్లోపు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని ఆదేశించింది. ఐదు సంవత్సరాలకు తక్కువ సేవా కాలం మిగిలి ఉండే వారు టెట్ లేకుండా పని కొనసాగించొచ్చు కానీ ప్రమోషన్ కోసం టెట్ తప్పనిసరి అని పేర్కొంది. టెట్ ఉత్తీర్ణత సాధించలేక పోతే ఉద్యోగంలో నుంచి తొలగింపు జరగొచ్చు. ఉద్యోగం నష్టపోయినా, అప్పటివరకూ వచ్చిన పెన్షన్ లాభాలు చెల్లింపు ఉంటుంది. కొత్తగా ఉద్యోగం చేయాలనుకునే వారు టెట్ కోర్సు తప్పనిసరి. అలాగే ప్రైవేట్, ప్రభుత్వ టీచర్లు, అందరూ ఒకే ప్రమాణాల ప్రకారం పరీక్ష రాయాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు దాదాపు 10 వేల మంది టెట్ పరీక్షలు రాయాల్సి ఉంది. టెట్‌పై ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. డిఎస్‌సి ద్వారా అర్హత సాధించి ఉద్యోగాల్లో చేరిన తమను ఇప్పుడు టెట్ పరీక్ష రాయాలని చెప్పడం సరైంది కాదు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే ఇన్సర్వీస్‌లో అన్న ఉపాధ్యాయులకు ఈ పరీక్ష నుండి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించుకుంటున్నారు.

జిల్లాపై 'మొంథా' ప్రభావం : జిల్లాపై మొంథా తుపాను ప్రభావం కనిపించింది. ఆదోని పట్టణంలో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రైతు బజార్‌లోకి వర్షపు నీరు చేరింది. కోసిగి మండలంలో చేపలవాగు ఉధృతంగా ప్రవ హించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. క్రిష్ణగిరి మండలం అమకతాడు గ్రామంలో మట్టిమిద్దె కూలిపోయింది. మొక్కజొన్న రైతులకు మొంథా తుఫాన్ కష్టాలను మరింత పెంచింది. ఇది వరకే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న రైతులు భారీగా నష్టపోయారు. మళ్లీ మొంథా తుఫాన్ రావడంతో కోత కోసిన పంటను, కోతకు సిద్ధంగా పొలాల్లో ఉన్న మొక్కజొన్న కంకులను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్ల ముందే పంట దెబ్బతింటుండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



6న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న నాయకులు

ఈనెల 6న ఎమ్మిగనూరు పట్టణంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) 3వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు తెలిపారు. శనివారం నగరంలోని కెకె భవన్‌లో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు ఓబులేసుతో కలిసి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... మున్సిపల్ రంగంలో సిఐటియు నాయకత్వంలో అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు ఉద్యమాలను రూపొందించేందుకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు కర్నూలు నగరం, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు పట్టణాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఒప్పందాలను అమలు చేయడంలో విఫలమైందని, వాటి అమలుకు ఉద్యమాలు చేపడతామని చెప్పారు.

ఫ్లాగ్ డే నిధికి విరాళాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని మహిళా సంఘాలు సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్‌కు అందజేసిన రూ.3 లక్షల మెగా చెక్కును శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మహిళా సంఘాల తరపున జిల్లా సమాఖ్య సభ్యులు కలెక్టర్ సిరికి అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు సంబంధించిన 30 వేల మంది సభ్యుల నుంచి రూ.10 చొప్పున సేకరించి, మొత్తం రూ.3 లక్షలను ఫ్లాగ్ డే నిధికి అందజేయడం మహిళా సంఘాల సామాజిక బాధ్యతకు నిదర్శనమని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని విరాళాలు అందజేయాలని సూచించారు. డిఆర్‌డిఎ పీడీ వైపి.రమణా రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రత్న రూత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.సీతా బాయి, కార్యదర్శి బిఎ.భాగ్యలక్ష్మి, ట్రెజరర్ జి.అరుణ పాల్గొన్నారు.

చిల్లబండలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -కోడుమూరు

మండలంలోని చిల్లబండ గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి చేపట్టారు. చిల్లబండ బాష ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదలకు, వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పింఛన్లను సకాలంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా పింఛను అందుతుందా అని ఆరా తీశారు. కోడుమూరులో మాల మునిస్వామి, ప్యాలకుర్తి ఎస్సీ కాలనీలో ఆర్.చంద్రమౌళి, షేక్షావలీ, మాదన్న పింఛన్లను పంపిణీ చేశారు. మండల కన్వీనర్ లక్కీ రెడ్డి రామకృష్ణారెడ్డి, ఎంపిడిఒ రాముడు, గోరంట్ల సర్పంచి బాలకృష్ణ, చంద్రమౌళి, రంగస్వామి, మాదన్న, అయ్యప్ప, అరుణ్ పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం - రూ.3 లక్షలు నష్టం

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని గొల్లలదొడ్డిలో సోమన్న, రాముడుకు చెందిన రెండు గడ్డి వాములు శనివారం దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు తాగి పడేసిన సిగరెట్ల కారణంగా మంటలు చెలరేగాయని, ఆర్పే ప్రయత్నం చేసినా అదుపు కాలేదని బాధిత రైతులు వాపోయారు. కోడుమూరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేలోపు పూర్తిగా కాలి బూడిదయ్యాయని తెలిపారు. మూగ జీవాల పోషణ కోసం గడ్డి వాములు సిద్ధం చేసుకున్నామని, ఒకరికి రూ.1.50 లక్షలు, మరొకరికి రూ.1.30 లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విఆర్ఒ ఉమర్ ఫరూక్ చేరుకుని నష్టం అంచనా వేసి తహశీల్దార్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు.

పత్తికి కనీస మద్దతు ధర కల్పించాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి


ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పత్తి రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధర కల్పించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి జిన్నింగ్ మిల్లు ప్రతినిధు లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, సంబం ధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ... పత్తిని బాగా ఆరబెట్టి తీసుకెళ్తే మంచి ధర వస్తుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వర్షాల నేపథ్యం లో తడిసిన పత్తిని రైతులు ఆరబెడుతున్నా తేమ శాతం కొంచెం ఉంటుందన్నారు. తేమ శాతం 12 శాతం మాత్రం ఉంటేనే కొనుగోలు చేయకుండా, 14 శాతం తేమ ఉన్నా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. పత్తిని కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాలో సొమ్మును జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెసి నూరుల్ కమర్ మాట్లాడుతూ... పత్తిని కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాలో సొమ్మును జమ చేయడంలో అలసత్వం వహించ కుండా వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జెడిఎ వరలక్ష్మి, మార్కెటింగ్ శాఖ ఎడిఎం నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైసిపి రైతు విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శివ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైసిపి రైతు విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జి.శివశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాల వేసి సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని మాట్లాడుతూ... పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వస్తాయని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.



కాటసానిని కలిసిన శివశంకర్‌రెడ్డి

రవీంద్రలో ఇఎల్‌టి వర్క్ షాప్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రిడ్జ్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌తో కలిసి శనివారం మహిళల రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ వర్క్‌షాపు నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి గాయత్రీ ఖన్నా ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. సిబిఎస్ఇలో ఎనీ ఎపి 2020కు అనుగుణంగా వచ్చిన కొత్త మార్పులను తెలుసు కోవాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనలో ఉపయోగపడే ప్రాయోగిక పద్ధతులు, గ్రూప్ యాక్టివిటీలు, లైఫ్ స్కిల్స్‌పై చర్చించారు. చివరగా, రిడ్జ్ స్కూల్ ప్రిన్సిపల్ రాజ్‌కమల్ మాథ్యూస్ గాయత్రీ ఖన్నాను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

- పత్తికొండ ఇన్‌ఛార్జీ డిఇ ఆదినారాయణ

ప్రజాశక్తి - పత్తికొండ

కొత్తగా ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని పత్తికొండ ఇన్‌ఛార్జీ డిఇ ఆదినారాయణ తెలిపారు. శనివారం హౌసింగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కొత్తగా ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం సచివాలయానికి వెళ్లి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని కోరారు.

సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని చాటుదాం

- మాజీ ఎంపీ టిజి.వెంకటేష్
- ఘనంగా కర్నూల్ ఉత్సవ్-2025 ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లా సాంస్కృతిక, సాహిత్య వైభవాన్ని కర్నూలు ఉత్సవ్-2025 ద్వారా దేశం నాలుగు మూలల చాటుదామని టిజివి కళాక్షేత్రం ఛైర్మన్, మాజీ ఎంపీ టిజి.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సందర్భంగా కర్నూలు కలెక్టరేట్ నుంచి టిజివి కళాక్షేత్రం వరకు చేపట్టిన భారీ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెలంగాణ రిటైర్డ్ డిజిపి కొత్తకోట శ్రీనివాసరెడ్డి, కర్నూలు డిఇఒ శ్యామ్యూల్ పాల్, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, పారిశ్రామికవేత్త బివి రెడ్డి, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యదర్శి యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు దేశ నాయకుల చిత్రపటాలతో కర్నూలు వైభవాన్ని చాటుతూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ అమరవీరులు పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఈ రాష్ట్ర అవతరణ అని, తొలి రాజధానిగా కర్నూలు ఎంతో ఖ్యాతి సంపాదించిందని అన్నారు. కర్నూలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని చెప్పారు. నేటి పాలకులు ఆ దిశగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. కళలకు కాణాచిగా గొప్ప గొప్ప కళాకారులను దేశానికి అందించిన ఘనత కర్నూలుకు దక్కుతుందన్నారు. కళాకారుల ఖిల్లా కర్నూలు అన్నారు. సాహిత్య రంగంలోనూ విశేష ప్రతిభ కలిగిన సాహితీవేత్తలు కర్నూలు నిండా ఉండడం ఆనందాన్నిస్తుందని చెప్పారు. కళాక్షేత్రంలో ఏడు రోజుల పాటు సాంస్కృతిక సాహిత్య ఉత్సవాలు కర్నూలు వైభవాన్ని చాటుతూ కనీవిని ఎరుగని రీతిలో చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం కళాక్షేత్రంలో జరిగిన ప్రారంభోత్సవ సభలో రిటైర్డ్ డిజిపి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు గడ్డపై ఇంతటి మహోన్నతమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. సమాజం మార్పు కోసం కళాకారులు పడే తపన, సాహిత్యకారులు చేసే కృషి వర్ణించలేనిదని కొనియాడారు. సమాజాన్ని మార్చగలిగే ఆయుధాలు కళలు మాత్రమేనని పేర్కొన్నారు. ఎపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎంతో చారిత్రిక వైభవం కలిగిన కర్నూలులో ఇంతటి గొప్ప కార్యక్రమాలు నిర్వహించడం చూస్తుంటే కర్నూలు కళల రాజధాని అనడంలో సందేహం లేదన్నారు. డిఇఒ శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక వైభవానికి ఇది ప్రతీక అన్నారు. అంతకుముందు కళాకారులు శ్రీకృష్ణదేవరాయలు, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు దేశనాయకుల వేష ధారణతో అలరించారు. సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యాసంస్థల అధినేత పిబివి.సుబ్బయ్య, నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా, సంఘ ఆంజనేయులు, శ్రీనివాసులు రెడ్డి, ఇనాయతుల్లా పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

పరిశుభ్రతకు కృషి

- ప్రజారోగ్య అధికారి నాగ ప్రసాద్ బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్



నగరంలో పరిశుభ్రత పెంపునకు కృషి చేస్తామని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్ బాబు తెలిపారు. శనివారం ఆయన నగరపాలక కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పారిశుధ్య పర్యవేక్షణాధికారి నాగరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, ప్రజారోగ్య విభాగ సిబ్బంది శు భాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... కిందిస్థాయి ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది సహాయ, సహకారాలతో ప్రజల ఆరోగ్యాలను కాపాడతానని చెప్పారు. తాను 2007లో చిత్తూరులో డాక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించామని తెలిపారు. తర్వాత 2009లో నంద్యాల జిల్లా నారాయణపురం, 2012 నుంచి 2019 వరకు కర్నూలు గడియారం ఆస్పత్రిలో, 2019 నుంచి 2020 వరకు కల్లూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో, 2021 నుండి 2025 వరకు గూడూరులో పనిచేసి ప్రస్తుతం కర్నూలు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారిగా డిప్యూటేషన్‌పై వచ్చి బాధ్యతలు స్వీకరించానని వివరించారు.

స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలి

- ప్రముఖ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్ రెహ్మాన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని ప్రముఖ ఆర్థికవేత ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్ రెహ్మాన్ తెలిపారు. శనివారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో 159వ కర్నూలు నగర దినోత్సవం నిర్వహించారు. వర్సిటీ రెక్టార్ ఎన్‌టికె.నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మన్సూర్ రహ్మాన్ మాట్లాడుతూ... కర్నూలు నగరం 1866 నవంబర్ 1న 'మద్రాస్ జిల్లా మున్సిపాలిటీ చట్టం' ప్రకారం మున్సిపాలిటీగా ఏర్పడిందని తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన మొదటి భాష ప్రయుక్త ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా సేవలందించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వపు స్మార్ట్ సిటీ అభివృద్ధి కార్యాచరణ ప్రతిపాదనలు కీలకమైనవని చెప్పారు. నగరం రహదారుల విస్తరణ, ట్రాఫిక్ సమస్య, డ్రెయినేజీ, మురుగువాడల నిర్మూలన తదితర సమస్యలు ఎదుర్కొంటోందని తెలిపారు. ఆర్థిక శాస్త్ర శాఖ ఉపన్యాసకులు డాక్టర్ శ్రీధర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు నగరాభివృద్ధి చర్చా వేదికలో చురుకుగా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మన్సూర్ రెహ్మాన్

ప్రాజెక్టుల నిర్మాణానికి పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

కర్నూలు పశ్చిమ ప్రాంతం ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల నిర్మాణానికి సిపిఎం ప్రజా ఉద్యమం చేపడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటేశులు తెలిపారు. శనివారం ఆదోనిలో సిపిఎం మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని కోరుతూ ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు సిపిఎం ప్రజా ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆదోని డివిజన్‌లో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని, ఇక్కడ సాగునీరు లేక కూలీలతో పాటు రైతులు కూడా వలస వెళ్తున్నారని చెప్పారు. వేదవతి, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో కొబ్బరికాయ కొట్టిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2024లో అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తి కావస్తున్నా ప్రాజెక్టుల ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పట్టించుకోలేదని, కనీసం కొబ్బరికాయ కొట్టిన చంద్రబాబు ప్రభుత్వమైనా ప్రాజెక్టుల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో వేదవతి, ఆర్‌డిఎస్ ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు కౌతాళం మండలం మేలిగనూరు దగ్గర తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టుల సాధనకు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రజా ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8లోపు అన్ని గ్రామాల్లోనూ జీపు, ఆటోజాతాల ద్వారా ప్రచారం నిర్వహించి, 9న కౌతాళం, ఆస్పరి, ఆలూరు, పెద్దకడబూరు, పెద్దతుంబలం నుంచి పాదయాత్రలు ప్రారంభించి, 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిపిఎం నాయకులు, ప్రజా సంఘాల కార్యకర్తలు భాగస్వాములు కావాలని కోరారు. సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి హనుమంతు, ఆదోని పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి లింగన్న, పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, ఆస్పరి మండల కార్యదర్శి బాలకృష్ణ, కౌతాళం మండల కన్వీనర్ ఈరన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

పోరాటంతోనే 'తుంగభద్ర' జలాల సాధన

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నది వరద జలాలను సిపిఎం ఆధ్వర్యంలో పోరాడి సాధించుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం కార్యాలయంలో మండల కన్వీనర్ ఈరన్న అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో తుంగభద్ర నదిపై మేలిగనూరు దగ్గర వరద కాలువ నిర్మించాలని, లేదా కుంబళనూరు దగ్గర బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించి వరద కాలువ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జలాలు ఉపయోగంలోకి రావాలంటే మండలంలో రెండు చోట్ల రిజర్వాయర్లు నిర్మించాలని కోరారు. దీని ద్వారా జిల్లాలో అత్యంత వెనుకబడిన కౌతాళ మండలంలో కరువు, వలసలను నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వాలు సాగునీటి వనరులు కల్పిస్తే, రైతులు మంచి పంటలు పండిస్తారని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. సాగు, తాగునీటి కోసం సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. పోరాటంలో ప్రజలు కలిసి రావాలని కోరారు. మండలంలో వరద కాలువ, లేదా కుడి కాలువ, రెండు చోట్ల రిజర్వాయర్లు నిర్మించి రైతులకు సాగు, తాగునీరు అందించేంత వరకు పోరాడతామని తెలిపారు. మండల నాయకులు వీరేష్, రామలింగ, ఈరన్న, హనుమంతు, వన్నూరప్ప, రామదాస్, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

కున్నూరు చెరువుకు నీటి సౌకర్యం కల్పిస్తాం

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని కున్నూరు చెరువుకు ప్రత్యేక తూము, పైపు లైను ఏర్పాటు చేయించి శాశ్వత నీటివసతి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం కున్నూరు గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టారు. అనంతరం పూర్తిస్థాయిలో నీటితో నిండిన కున్నూరు చెరువుకు టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి జల హారతి ఇచ్చి నీటి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... కున్నూరు గ్రామాభివృద్ధికి కృషి చేశానని, గతంలోనే ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి బిటి రోడ్డు ఏర్పాటు చేయించి నారా లోకేష్ చేత ప్రారంభించామని తెలిపారు. కున్నూరు చెరువును పూర్తిస్థాయిలో నీటితో నింపిన తర్వాతనే జలహారతి ఇచ్చేందుకు గ్రామంలోకి వస్తానని 2024 ఎన్నికల సమయంలో గ్రామస్తులకు మాట ఇచ్చానని, ఈ మేరకు చెరువును నిండుకుండలా పూర్తిస్థాయిలో నింపి జలహారతి ఇచ్చి ప్రారంభించేందుకు వచ్చి మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి రమణ, మహల్ రహంతుల్లా, నజీర్ సాహెబ్, పూజారి చంద్రశేఖర్, ఐరన్‌బండ ముల్లా బాష పాల్గొన్నారు.



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు

నిరుద్యోగ భృతి రూ.3 వేలివ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు సురేష్, నాయకులు రాముడు కోరారు. శనివారం డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎన్‌టిఆర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ముందుగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు ఎల్లేష్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తోందని, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదని విమర్శించారు. జిల్లాలో పరిశ్రమలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వలేదన్నారు. 2025 టెట్ ఫీజు రూ.1000 పెట్టడం తగదని తెలిపారు. టెట్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్, రాకేష్, మోహన్, చందు, ఈరన్న, రమేష్, నరసింహులు పాల్గొన్నారు.



డివైఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- ఎంపిడిఒ కార్యాలయం ముందు మహిళల ధర్నా

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని కోయ నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు, నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మహిళలు ఖాళీ బిందెలతో ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి, మైనా, ఐద్వా నాయకులు షేకున్‌బీ, మహేశ్వరి మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. గత నెల రోజుల నుంచి ఆలూరులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయం లేక నీటి సమస్య తలెత్తుతోందని, గత 15 రోజుల నుంచి ఆలూరులోని ఏదో ఒక కాలనీలో ప్రజలు నీళ్ల లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 20 రోజులుగా తాగునీరు రాకపోతే ఏం తాగాలని మహిళలు ఎంపిడిఒను ప్రశ్నించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎంపిడిఒను కార్యాలయం లోపలికి వెళ్లనివ్వబోమని, సంబంధిత అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఎంపిడిఒ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. వెంటనే ఎంపిడిఒ జోక్యం చేసుకొని సంబంధిత పంచాయతీ వాటర్ మెన్‌ను పిలిపించి నీటి సమస్య పరిష్కరించాలని, వెంటనే కోయ నగర్ కాలనీకి తాగునీరు వదలాలని మందలించారు. అనంతరం ఎంపిడిఒ మద్దిలేటి స్వామికి వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు బి.మహేశ్వరి, తేజేశ్వరి, ముంతాజ్, నాగరత్నమ్మ, పల్లవి, మునెమ్మ, విజయలక్ష్మి, అంజలి, ప్రసన్న, నిర్మల, అశ్విని, లక్ష్మి, లింగమ్మ, భారతి పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న మహిళలు, నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిశ్రమల ఏర్పాటుతోనే అభివృద్ధి

- పాలకులు నిర్లక్ష్యం చేశారని ధ్వజం
- ప్రజా వేదికలో వక్తలు

ప్రజాశక్తి - ఆదోని

పరిశ్రమల ఏర్పాటుతోనే ఆదోని అభివృద్ధి సాధ్యమని, ఈ ప్రాంతాన్ని పాలకులు నిర్లక్ష్యం చేశారని ప్రజలు మండిపడ్డారు. శనివారం ఆదోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో కమిషనర్ కృష్ణ అధ్యక్షతన 'ప్రజా వేదిక' నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, ఫుడ్ కమిషన్ మాజీ సభ్యులు గుడిసె ఆది కృష్ణమ్మ, రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు హాజరయ్యారు. ఆదోని అభివృద్ధి చెందాలంటే జిల్లా ఏర్పాటుతోనే సాధ్యమని వచ్చిన వారందరూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ... ఆదోని నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ... పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిందని, కారణాలు చెప్పాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే అనుచరులు అడ్డు తగలడంతో గందరగోళం నెలకొంది. ఆదోని వాసి తాయన్న మాట్లాడుతూ.... ఎమ్మెల్యే కాగానే ఆదోనిలో పరిశ్రమ నెలకొల్పుతామని.. ఛానెల్ డిబేట్‌లో విదేశీయులతో మాట్లాడినా.. గెలిచి 16 నెలలు గడిచినా ఆదోనికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే పార్థసారథి సమాధానం ఇస్తూ... పరిశ్రమ నెలకొల్పాలంటే 500 ఎకరాలు భూమి కావాలని, ఇక్కడ అలాంటి వనరుల్లేకపోవడంతో పరిశ్రమను స్థాపించేందుకు వ్యాపారవేత్తలు ముందుకు రావడం లేదని వివరించారు. చమురుశుద్ధి కేంద్రం ఏర్పాటుకు సుముఖత చూపినా పరిస్థితులు అనుకూలించడం లేదన్నారు. జై భీమ్ యూత్ నాగరాజు మాట్లాడుతూ... ఆదోనిలో సుమారు 16 ఎస్సీ కాలనీలు ఉన్నాయని, అక్కడ మరుగుదొడ్లు లేకపోవడంతో ఇప్పటికీ చెంబు చేత పట్టి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. వ్యాపారవేత్త అశోక్ నంద రెడ్డి మాట్లాడుతూ... పట్టణంలో కాకుండా ఇస్వీ రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ షెడ్ ఏర్పాటు చేయాలని, అప్పుడు ట్రాఫిక్ తగ్గుతుందని సూచించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశులు మాట్లాడుతూ... ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే రైల్వే వ్యాగన్ల లోడింగ్, అన్‌లోడింగ్ చేయిస్తామని తెలిపారు. సీనియర్ అడ్వకేట్ దేశాయ్ మాట్లాడుతూ... సిగ్నల్ ఏర్పాటు చేసినా ఇంతవరకు వాడకంలోకి రాలేదని, కొందరు ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని తెలిపారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... సిగ్నల్ స్తంభాలు వచ్చాయని, త్వరలో ఉపయోగంలోకి తెస్తామని హామీఇచ్చారు. సాగునీటి వాటా పరిరక్షణ కమిటీ సభ్యులు సాయిబాబు మాట్లాడుతూ... డివిజన్‌లో పెద్ద వాగులు, వంకలు ఉన్నాయని, రిజర్వాయర్లు నిర్మిస్తే సస్యశ్యామలమవుతుందని తెలిపారు. రైతు కూలీలకు పనులు దొరుకుతాయని, వలసలను అరికట్టవచ్చని సూచించారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప మాట్లాడుతూ... టిడ్కో గృహాలు, జగనన్న కాలనీలోని గృహాలు నిరుపయోగంగా ఉన్నాయని, లబ్ధిదారులకు కేటాయించేలా ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. జనసేన నాయకులు తాహేర్ వలీ మాట్లాడుతూ... భగత్ సింగ్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వాస్పత్రి నుంచి కర్నూలుకు ఉచిత అంబులెన్స్ నడుపుతున్నామని, మరిన్ని సమకూర్చాలని కోరారు. గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ... కృష్ణమ్మ సేవాసంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే స్వచ్ఛత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామాలను దత్తత తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధికి అధికారులు చొరవ చూపాలని కోరారు. శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ... జిల్లా సాధనకు 2018లోనే ఉద్యమాలు చేశామని, రాజకీయ కుట్రల వల్ల ఆదోని జిల్లాకు చొరవ చూపలేదని, ఇప్పుడైనా ప్రభుత్వం జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, విట్టా రమేష్, సతీష్, బసాపురం రామస్వామి, పులి రాజు, జయరాం, దస్తగిరి నాయుడు, నీలకంఠప్ప, ఉపేంద్ర,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సాయిరామ్, మున్సిపల్ డిఇలు గోపీనాథ్, రామమూర్తి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య, ఇరిగేషన్ డిఇ షఫీవుల్లా, మున్సిపల్ ఆర్ఒ నాసిర్ హుస్సేన్, ఆర్‌టిసి డిఎం అహ్మద్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, సిఐలు రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ గౌస్, శ్రీరామ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను నిలదీస్తున్న దేవిశెట్టి ప్రకాష్

పెద్దహరివాణం బంద్ విజయవంతం

ప్రజాశక్తి-ఆదోని

పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కోరుతూ.. శనివారం బంద్ ప్రకటించడంతో... గ్రామస్తులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ముందుగా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. వెనుకబడిన ప్రాంతం, మండలంలోని అతి పెద్ద గ్రామం పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలని కోరారు. సాధన కమిటీ ఆదినారాయణ రెడ్డి, సభ్యులు నాగ రాజ్, కర్రెప్ప, గర్జప, సున్ను సాబ్, మధు, మల్లప్ప, మారెప్ప, పరమేష్, వీరేశప్ప, ఢాబా మల్లి రెడ్డి, రాము, రంగస్వామి మాట్లాడుతూ... ఈనెల 16లోపు పెద్దహరివాణం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించకపోతే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. వ్యాపారులు, విద్యాసంస్థలు, బ్యాంకులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు.



బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్తులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి


ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఇంగలదహల్ గ్రామంలో డ్రెయినేజీ, సిసి రోడ్ల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శనివారం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే బి.విరుపాక్షికి కెసి.తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు వీరేష్ వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రహదారి సమస్య ఉందని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. ఉప సర్పంచి మహంతేష్, యూత్ సభ్యులు మహానంది, మల్లి పాల్గొన్నారు.

బదిలీ ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి - చిప్పగిరి

సాధారణ బదిలీల్లో భాగంగా చిప్పగిరి నుంచి కర్నూలు ఫోర్త్ టౌన్‌కు వెళ్తున్న ఎస్ఐ ఎపి.శ్రీనివాసులును శనివారం చిప్పగిరి భోగేశ్వర దేవాలయం ఆవరణలో చిప్పగిరి మండల ప్రజలు సన్మానించారు. ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు మండలానికి వచ్చిన అనతి కాలంలోనే మండల ప్రజలకు సేవలందించారని, విధుల్లో ఏమాత్రం తగ్గకుండా మండలం ప్రశాంతంగా ఉండేందుకు కృషి చేశారని తెలిపారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... అధికారులకు బదిలీలు సాధారణమని, ఇక్కడ విధులు నిర్వర్తించిన తనకు ఇక్కడి ప్రజలు, నాయకులు సహకరించారని చెప్పారు. చిప్పగిరి మండల ప్రజలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకరించిన పోలీసు స్టేషన్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



బదిలీ ఎస్ఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న మండల ప్రజలు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి : సర్పంచి

ప్రజాశక్తి - మంత్రాలయం

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మేజర్ పంచాయతీ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య సూచించారు. దీపావళి పండగ సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు స్థానిక హెలిప్యాడ్ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన ఎమ్మిగనూరు 11 జట్టుకు రూ.30 వేల నగదు, రన్నర్‌గా నిలిచిన మంత్రాలయం సుశమీంద్ర 11 జట్టుకు రూ.20 వేల నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరులు ముందుంటారని తెలిపారు. వైసిపి నాయకులు గుడికల్ మారెప్పతో కలిసి బహుమతులు అందజేసినట్లు చెప్పారు. అంతకుముందు ఆర్గనైజర్ బాలరాజు, క్రీడాకారులు నాయకులకు పూలమాలలు, శాలువా వేసి సన్మానించారు.



బహుమతులు అందేస్తున్న సర్పంచి భీమయ్య

క్రీడల్లోనూ రాణించాలి

- భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్ర బాబు

ప్రజాశక్తి - ఆదోని


విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్ర బాబు తెలిపారు. స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేమ్స్‌లో ప్రతిభ కనిబరిచిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అండర్-14 విభాగంలో ఆదోని భాష్యం విద్యార్థులు విజయ దుందుభి మోగించారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు, యోగా అవసరమన్నారు. అండర్-14 యోగా విభాగంలో వరుసగా శ్రీలౌక్య 6వ తరగతి, హరిప్రియ 7వ తరగతి, ధాన్వి 9వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. పిఇటిలు శంకర్, పవిత్రను అభినందించారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ భార్గవ్ పవన్, ప్రధానోపాధ్యాయులు శిరీష ఉన్నారు.

కౌతాళం చేరిన బ్రహ్మ సూత్ర శివలింగం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో అతిపూరతనమైన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్టిస్తున్న బ్రహ్మ సూత్ర శివలింగం కౌతాళం చేరుకుంది. శనివారం దేవాలయ అర్చకులు, ఆలయం కమిటీ వారు స్థానిక అర్చకులు బుజ్జి స్వామి ఇంటి నుంచి శివలింగాన్ని కలశం, మేళాతాళాలు, కుంభాలు భజంత్రీలతో ఊరేగిస్తూ ఆలయాన్ని చేరుకున్నారు. అనంతరం ఆలయంలో 11 రోజులు శరణ బసవేశ్వర స్వామి పురాణం, ప్రవచనంలో భాగంగా కర్ణాటక రాష్ట్రం రౌడ్కుంద మఠం పీఠాధిపతి శివయోగి శివాచార్య పాల్తూరు, మేలిగనూరు పీఠాధిపతి చెన్నవీరశివాచార్య, హల్వీ చరణగిరి మఠం పీఠాధిపతి మహంతస్వాములు, కామవరం శివలింగయ్య మఠం శ్రీగురు రాంప్రకాశ్ ప్రవచనాలతో ఆశీర్వాదం అందజేశారు. శివలింగాన్ని జలాదివాసం చేస్తున్నట్లు ఆలయం కమిటీ సభ్యులు సక్రి తిక్కయ్య, పూజారి లింగన్న, పుగ్గి బసవ, కోడిగుడ్ల రామాంజిని, బారికి నాగరాజ్, ఆలయ అర్చకులు ఎం.బుజ్జి స్వామి, చంద్రశేఖర్ స్వామి, మల్లి స్వామి, నవీన్ స్వామి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి సహకారం : శ్రీరామలింగేశ్వర స్వామి నూతన బ్రహ్మ సూత్ర లింగేశ్వర ప్రతిష్టాపనకు వైసిపి మండల కార్యదర్శి దేశాయి ప్రహ్లాద చారి రూ.75 వేలు విరాళంగా ఇచ్చారు. ఈయనకు దేవాలయ కమిటీ శాలువా, పూలమాలలతో సన్మానించింది. సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఉప సర్పంచి తిక్కయ్య, నాయకులు సత్యప్ప స్వామి, వడ్డే రాముడు, ఉసేని, అబ్దుల్ సమద్, రామకృష్ణ, ఖాదర్ లింగ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దేశాయి ప్రహ్లాద చారి

2029లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలి

- విభేదాల్లేకుండా పార్టీని ముందుకు తీసుకెళ్తాం
- వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కడిమెట్ల రాజీవ్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, గ్రూపు విభేదాలు లేకుండా వైసిపిని ముందుకు తీసుకెళ్తానని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కడిమెట్ల రాజీవ్ రెడ్డి తెలిపారు. శనివారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జీ కడిమెట్ల రాజీవ్ రెడ్డి, సీనియర్ నాయకులు కడిమెట్ల జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు. తమ కుటుంబంపై నమ్మకముంచి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు అప్పజెప్పడంతో కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలతో కలిసి వైసిపిని బలోపేతం చేస్తామని, అందరినీ కలుపుకు పోతామని చెప్పారు. అనంతరం రాజీవ్ రెడ్డిని నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. వైసిపి నాయకులు గడ్డం నారాయణరెడ్డి, భీమ్ రెడ్డి, నాగేశప్ప, ఖాసీం బేగ్, డిష్ కేశవరెడ్డి, మాచాని వెంకటేష్, గిడ్డయ్య, రంగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జీ కడిమెట్ల రాజీవ్ రెడ్డి

కనీస వేతన చట్టం అమలు చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు అధ్యక్షత వహించారు. రామాంజనేయులు, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. చిరు ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు, స్కీం వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు, పని గంటల పెంపు జిఒ రద్దుకు ఉద్యమించాలని కోరారు. సిఐటియు మండల, పట్టణ నాయకులు యు.రమేష్, ఎ.సురేష్, జె.నాగరాజు, బి.గోవర్ధనమ్మ, ఎస్.నాగలక్ష్మి, ఎస్.సాబీర్, సి.నారాయణ, చిట్టెమ్మ, యుఎమ్.నాగలక్ష్మి, జావీద్, మున్నీ, కె.ఖాజా, ఎస్.కర్రెన్న పాల్గొన్నారు.

ఎస్ఐగా మన్మథ విజయ్ బాధ్యతలు

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ఎస్ఐగా జె.మన్మథ విజయ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసిన మహబూబ్ బాష కర్నూలు విఆర్‌కు వెళ్లగా.. కర్నూలు డిటిసి నుంచి ఆలూరు ఎస్ఐగా జె.మన్మథ విజయ్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ... ఆలూరు, ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్టు వేస్తూ శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.



పింఛన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యం

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తిలోని రెండో సచివాలయంలో పనిచేసే మహిళా పోలీసు పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పింఛన్లు తీసుకునేందుకు సచివాలయానికి రావాలని పింఛనుదారులను ఇబ్బంది పెడుతున్నారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు సైతం ఇబ్బంది పడుతూ కార్యాలయానికి వెళ్లి పింఛను కోసం వేచి ఉంటున్నారు. సచివాలయ ఉద్యోగి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వెల్దుర్తి కార్యదర్శి లక్ష్మీనాథ్ సచివాలయం వెళ్లి పరిశీలించగా కార్యాలయంలోనే పింఛను అందిస్తున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిడిఒ సుహాసినమ్మను వివరణ కోరగా... సచివాలయ ఉద్యోగిపై ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పౌరులు బాధ్యతగా మెలగాలి : డీఎస్పీ సోమన్న

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పౌరులందరూ బాధ్యతగా మెలిగినప్పుడే ఆదర్శవంతమైన సమాజం ఏర్పడుతుందని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ డి.సోమన్న తెలిపారు. శనివారం ఉస్మానియా కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... చట్టం ముందు అందరూ సమానులేనని, విద్యార్థులు ప్రశ్నించడం నేర్చుకోవాలని తెలిపారు. 'లంచం ఇవ్వం, తీసుకోమ'ని ప్రతిజ్ఞ పూనాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ మాట్లాడుతూ... లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ అవినీతి కిందికే వస్తాయన్నారు. రిటైర్డ్ డీఎస్పీ ఎస్‌డి.తేజేశ్వరరావు, ఎసిబి ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణయ్య, తెలుగు శాఖ అధ్యక్షులు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.



విజిలెన్స్ వారోత్సవాల్లో మాట్లాడుతున్న డీఎస్పీ సోమన్న

హత్య కేసును ఛేదించిన పోలీసులు

ఫొటో : మాట్లాడుతున్న సిఐ తబ్రేష్

ప్రజాశక్తి -కోడుమూరు

గతనెల 27న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం సిఐ తబ్రేజ్ మాట్లాడుతూ... పి.కోటకొండ గ్రామానికి చెందిన కమ్మరి దస్తగిరి (40)కి 16 ఏళ్ల క్రితం దేవనకొండ మండలం చెల్లెలి చెలిమి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ అలియాస్ వరలక్ష్మితో వివాహం జరిగిందని తెలిపారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని చెప్పారు. వరలక్ష్మి ప్రవర్తన సరిగా లేదని పెళ్లి అయినప్పటి నుంచి వారి మధ్య గొడవలు జరిగేవని, ఆమె పి.కోటకొండ గ్రామంలో ఆశావర్కర్‌గా పని చేసేవారని తెలిపారు. భార్యాభర్తల గొడవల వల్ల నాలుగు నెలల క్రితం ఆమె ఉద్యోగాన్ని రూ.2 లక్షలకు అమ్ముకొని కర్నూలుకు వెళ్లారని చెప్పారు. పెద్దపాడు రోడ్డులో ఉన్న హోసన్నా మందిరం వద్ద ఇల్లు తీసుకుని ఉండగా అప్పటికి సుమారు 3 నెలల క్రితం దస్తగిరి తన భార్య వద్దకు పోయి రాజీ అయి ఇద్దరు కలిసి కాపురం చేసుకుంటున్నారని తెలిపారు. దస్తగిరి వరలక్ష్మి ప్రవర్తనపై అనుమానపడేవారని, ఇద్దరు గొడవపడేవారని చెప్పారు. సుమారు 15 రోజుల క్రితం డ్యూటీ నిమిత్తం దస్తగిరి బళ్లారి వెళ్లి అక్కడే ఉంటున్నారని, అప్పుడప్పుడు వరలక్ష్మికి ఫోన్ చేసేవారని, ఆమె లిఫ్ట్ చేయనందున గత మూడు రోజుల క్రితం ఆయన అతడు తిరిగి వచ్చి తన భార్య గురించి అనుమాన పడి ఆమెతో గొడవ పడ్డారని తెలిపారు. ఆమె దస్తగిరిని చంపాలనే ఉద్దేశంతో 27న రాత్రి వరలక్ష్మి సొంత అన్న కమ్మరి శేఖర్, పెద్దమ్మ కొడుకు కమ్మరి వీరేష్‌లు కట్టెలతో కొట్టి గాయపరిచి రాత్రి 10.30 గంటలకు ఆటోలో తీసుకొచ్చి పాలకుర్తి గ్రామ సమీపంలోని ఎర్రచందనం పార్కు బోర్డు వద్ద గల చనుగొండ్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో కిందకి దించి అతని మెడకు టవల్ చుట్టి ముగ్గురు కలిసి ఉరివేసి చంపారని చెప్పారు. అక్కడే పడేసి వెళ్లగా కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. ముగ్గురిని పత్తికొండ రోడ్డులో గల కృష్ణాపురం క్రాస్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఆటోను, టవల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచారు.



మాట్లాడుతున్న సిఐ తబ్రేష్



ఢీకొట్టిన టెంపో

టెంపో వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

టెంపో ట్రావెలర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందినట్లు మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమ్ రావు (44) మృతి చెందారు. ఎస్ఐ వివరాల మేరకు... కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా గట్టుబిచ్చల గ్రామానికి చెందిన భీమ్ రావు టివిఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై పెద్దకడబూరు మండలం ముచ్చుగేరి గ్రామానికి తన భార్య కాలు నొప్పికి టాబ్లెట్లు తీసుకొచ్చేందుకు బయల్దేరారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వైపు వస్తున్న టెంపో ట్రావెలర్ వాహనం రచ్చుమర్రి గ్రామ సమీపంలోని మారెమ్మ గుడి దగ్గర ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భీమ్ రావు తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భీమ్ రావు భార్య అంబికా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నేడు కురువల వన భోజనం

- కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు సమీపంలోని పెద్దపాడు రహదారిలో ఉన్న రాజీవ్ గృహకల్ప ఎదురుగా ఎపి మోడల్ స్కూల్ పక్కన బీరలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం కురువల వనభోజనం నిర్వహిస్తున్నట్లు కురువ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి బోడబండ నరసింహులు శనివారం తెలిపారు. కార్యకమానికి కురువలు పెద్ద ఎత్తున తరలివచ్చి కురువల ఐక్యతను చాటాలని కోరారు.

విద్యార్థుల ఇండస్ట్రీయల్ విజిట్

ప్రజాశక్తి - వెల్దుర్తి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల 9, 10వ తరతగి, జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఇండస్ట్రీయల్ విజిట్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జి.లక్ష్మీప్రసన్న అధ్యక్షతన ఐటిఐటిఎస్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ ట్రేడ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఐటిఐటిఎస్ విద్యార్థులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీలక్ష్మీ ప్రింటింగ్ ప్రెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్‌లోని భాగంగా సోలార్ ఇండస్ట్రీ, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర వాటర్ ప్యూరిఫైర్‌ను సందర్శించారు. ఇలాంటి ఇండస్ట్రీయల్ విజిట్ ద్వారా విద్యార్థులకు ప్రయోగిక పరిజ్ఞానం పెరుగుతుందని యూనియన్ బ్యాంకు మేనేజర్ శైలేందర్ తెలిపారు. ఒకేషనల్ ట్రైనర్స్ జి.సౌజన్య (ఐటిఐటిఎస్), కె.రాజమ్మ పాల్గొన్నారు.


ప్రజలకు భరోసా.. ఎన్‌టిఆర్ భరోసా పింఛను



- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

ఎన్‌టిఆర్ భరోసా పింఛను ప్రజలకు భరోసా అని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని దొడ్డి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి అధ్యక్షతన పింఛన్ల పంపిణీ చేపట్టారు. రాఘవేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. టిడిపి నాయకులు ముత్తు రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, జ్ఞానేష్, తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేష్, నాడిగేని తాయన్న, హోళగుంద కోసిగయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జీ రంగారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని చెట్నెహళ్లి గ్రామంలో సచివాలయ అధికారులతో కలిసి మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ పింఛన్ల పంపిణీ చేపట్టారు. గ్రామ కార్యదర్శి మహేష్ ఉన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉలిందకొండలో పింఛన్ల పంపిణీ



కర్నూలు హాస్పిటల్ : కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో శనివారం టిడిపి ఉలిందకొండ సీనియర్ నాయకులు, సింగిల్ విండో ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఇవి.రమణ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఉలిందకొండ యూనిట్ కన్వీనర్స్ యుద్ధం శ్రీకాంత్, బొగ్గుల షేక్షావలీ, విక్రమ్ కుమార్, మధు కిరణ్ పాల్గొన్నారు.

90 శాతం పింఛన్లు పంపిణీ : ఎంపిడిఒ అల్లా బకాష్

చిప్పగిరి : మండలంలోని 16 గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ఒకేరోజు దాదాపు 90 శాతం పూర్తయిందని ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సర్వర్లు బాగా పనిచేసినందున ఒకే రోజు పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి చేశామన్నారు. అందుబాటులో లేని వారు మాత్రమే మిగిలి ఉన్నారని, వారికి కూడా సోమవారం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం త్వరలో అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి అవకాశం కల్పిస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది కూడా పింఛన్ల పంపిణీని సజావుగా నిర్వహించారని చెప్పారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న రమణ

వైష్ణవి అకాడమీ ఆధ్వర్యంలో స్ఫూర్తి మెమోరియల్ టాలెంట్ టెస్ట్

- వైష్ణవి అకాడమీ ఛైర్మన్ విష్ణు ప్రభు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వైష్ణవి అకాడమీ ఆధ్వర్యంలో స్ఫూర్తి మెమోరియల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు వైష్ణవి అకాడమీ ఛైర్మన్ జి.విష్ణు ప్రభు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వైష్ణవి జూనియర్ కళాశాలలో జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థుల కోసం స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు మార్గం చేసుకోగలరని తెలిపారు. ఈ టాలెంట్ టెస్టు ఈనెల 2న ఆదివారం ఉదయం 9.45 గంటలకు జూనియర్ కళాశాల కొండవీటి ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9908967858, 9885152082, 8499077981 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని బిక్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు ప్రసన్న కుమార్, వాణిప్రసన్న, మల్లికార్జున, విజయశేఖర్, సోమేష్, చిన్న మల్లేశ్వరుడు, ఉల్గోజి రావు, సుజాత, జబీన్ అక్తర్, గిరిజారాణి, లక్ష్మి, బాల శంకర్, లావణ్య పాల్గొన్నారు. అలాగే స్థానిక క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, చరిత్ర అధ్యయన శాఖల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి, వైస్ ప్రిన్సిపల్స్ ఎ.సత్యనారాయణ, జె.హేమంత్, డాక్టర్ మాదన్న, డాక్టర్ ఫక్రున్నీసా బేగం, డాక్టర్ వి.వింధ్య వాసినీ దేవి, రాము దాసరి, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సుజాత, డాక్టర్ రోషన్, జి.శ్రీనివాస్, శశికళ, హేమలత, మెహర్ జహాన్ పాల్గొన్నారు. **సిబెళగల్** పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్, కార్యదర్శులు సునీలా రాణి, మంజులా, ఏపీవో రామన్న సమక్షంలో ఎంపిడిఒ రాణెమ్మ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కర్నూలు (హాస్పిటల్)**లోని నిరాశ్రయ వసతి గృహంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వసతి గృహ నిర్వాహకురాలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, లోక్ అదాలత్ మెంబర్ రాయలసీమ శకుంతల మాట్లాడుతూ... దేశ అభివృద్ధిలో మనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగాలన్నారు.



ఒకేషనల్ కళాశాలలో



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో



బెళగల్ మండలంలో

కోసిగి ఎస్ఐగా రమేష్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి



కోసిగి ఎస్ఐగా డి.రమేష్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అన్నమయ్య జిల్లా మహిళ పిఎస్ నుంచి ఇక్కడికి వచ్చారు. గతంలో ఎస్ఐగా పనిచేసిన హనుమంతు రెడ్డి కర్నూలు టూ టౌన్‌కు బదిలీ అయ్యారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.


ముగిసిన లా సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన లా సెమిస్టర్ పరీక్షలు శనివారం ముగిశాయి. నాలుగో సెమిస్టర్ పరీక్షకు 244 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 216 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎస్ఐగా నరేష్ బాధ్యతలు

ప్రజాశక్తి - వెల్దుర్తి



వెల్దుర్తి ఎస్ఐగా ఎం.నరేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు మట్కా, సారా, పేకాట, బెల్ట్ షాపులు వంటివి నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఏవైనా సమస్యలుంటే తమను నేరుగా సంప్రదించవచ్చని అన్నారు. గొడవలు, కక్షలు, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

- రాయలసీమ విద్యావంతుల వేదిక

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పొట్టి శ్రీరాములు త్యాగానికి స్ఫూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపాలని, శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వేదిక సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి, కర్నూలు పూల బజారులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన చేపట్టారు. రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ అరుణ్ మాట్లాడుతూ... పొట్టి శ్రీరాములు 53 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణ త్యాగం చేయడం వల్ల ఆంధ్ర రాష్ట్రం సిద్ధించిందని, కర్నూలు రాజధానిగా అక్టోబర్ 1, 1953న తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారని తెలిపారు. తెలంగాణ జిల్లాలు కలవడంతో నవంబర్ 1, 1956న ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో కర్నూలు రాజధానిని కోల్పోయిందని చెప్పారు. అప్పటి నుంచి రాయలసీమ వివక్షతకు, అన్యాయానికి గురవుతోందని తెలిపారు. ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయడం లేదని, విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. విరసం బాధ్యులు పాణి, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకులు యోహాన్, ప్రజా పరిరక్షణ సమితి నాయకులు డేవిడ్, హంద్రీ పరిరక్షణ సమితి నాయకులు సుంకన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ రత్నం, ఏసేపు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు



అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శనివారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల గురించి సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

అందరికీ విద్య 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' లక్ష్యం

ప్రజాశక్తి - సిబెళగల్

చదువురాని వారందరికీ ఓనమాలు నేర్పించి విద్యనందించడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర ప్రాజెక్టు లక్ష్యమని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు అధికారి ప్రతాప్ పేర్కొన్నారు. శనివారం ఎపిఎం రామేశ్వర్, సూపర్‌వైజర్ జాకీర్ సమక్షంలో మండల వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అభ్యాసన పుస్తకాలు పంపిణీ చేసి ఆసక్తి కలిగిన వారందరికీ ఓనమాలు నేర్పించి తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.




ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు టిడిపి ఇన్‌ఛార్జీకి కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కులు అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

ఎస్ఐ సతీష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ఎస్ఐగా బి.సతీష్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఆయనను చిప్పగిరి ఎస్ఐగా నియమిస్తూ ఇటీవల ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపడానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజలకు రక్షణ కల్పిస్తామన్నారు. పోలీసు సిబ్బంది ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ట్రెయినీ ఎస్ఐ రాజు కుళ్లాయప్ప, పోలీసులు సుబ్రమణ్యం, ఖాదర్ వలీ, షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.బాష, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్, సువర్ణమ్మ, రికార్డు అసిస్టెంట్ బి.ఈశ్వరమ్మ, నాగ భాస్కర్, హెల్పర్ ఉమా, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్‌తోనే పొగాకు సాగు చేయాలి

- ఎఒ అక్బర్ బాషా

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని రైతులు అగ్రిమెంట్ ద్వారా మాత్రమే పొగాకు పంటను సాగు చేయాలని, బ్లాక్ బెర్లి పొగాకు రకం నిషేధించినట్లు ఎఒ అక్బర్ బాషా తెలిపారు. బ్లాక్ బెర్లీ రకాన్ని ఎవరూ సాగు చేయకూడదని చెప్పారు. శనివారం రామళ్లకోట, వెల్దుర్తి గ్రామాల్లోని పత్తి, కంది, పొగాకు పంటలను క్షేత్రస్థాయిలో వారు పరిశీలించారు.



పింఛనుతో వృద్ధులకు భరోసా

- టిడిపి పట్టణ ఆర్థిక కార్యదర్శి విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న విజయలక్ష్మి

ఎన్‌టిఆర్ భరోసా పింఛనుతో వృద్ధులు, వికలాంగులకు భరోసా ఇస్తున్నట్లు టిడిపి పట్టణ ఆర్థిక కార్యదర్శి విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను సచివాలయ అధికారులతో కలిసి అర్హుల ఇంటి దగ్గర వెళ్లి పంపిణీ చేశారు. 1వ తేదీ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వికలాంగుల కళ్లలో ఆనందం వెల్లివిరిసేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైందని తెలిపారు. గత ప్రభుత్వంలో రూ.3 వేల పింఛను ఇవ్వడానికే ఐదేళ్లు పట్టిందని, మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు పెంచారని చెప్పారు. రాబోయే 40 ఏళ్లు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. వార్డు ఇన్‌ఛార్జీ నరసింహులు పాల్గొన్నారు.

ఓర్వకల్లులోని సమస్యలను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లు పంచాయతీ కార్యదర్శికి సిపిఎం ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. నాగన్న, సిపిఎం మండల నాయకులు రామకృష్ణ, స్థానికులు మున్నా, పుల్లయ్య మాట్లాడుతూ... గ్రామాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, గ్రామంలో రోడ్లు, కాలువలు, మురుగు సమస్య పరిష్కరించడంలో విఫలం చెందిందని విమర్శించారు. ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారయి వాహనదారులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు